క్లుప్తంగా

ప్రమాద భరితంగా బ్రిడ్జి



తాడేపల్లిరూరల్ : రాజధానికి వెళ్లేందుకు ప్రధాన రహదారి అయిన పెనుమాక–కృష్ణాయపాలెం మధ్య కొండవీటి వాగుపై ఏర్పాటు చేసిన బ్రిడ్జి రైలింగ్ గోడ విరిగిపోయి ప్రమాద భరితంగా మారింది. అసలే అది సింగిల్ బ్రిడ్జి. ఆ బ్రిడ్జిపై బస్సు వస్తే మరో ద్విచక్రవాహనం వెళ్లేందుకు మాత్రమే మార్గం ఉంటుంది. రైలింగ్ గోడ విరిగిపోవడంతో రాజధాని గ్రామాలకు వెళ్లే ప్రజలు ఆ బ్రిడ్జిపై ప్రయాణించాలంటే ఆందోళన చెందుతున్నారు. ఇరిగేషన్ శాఖ అధికారులు తక్షణమే అక్కడ రైలింగ్ నిర్మాణం చేయాలని పలువురు కోరుతున్నారు.

9, 10 తేదీలలో ఓటర్ల జాబితాపై ప్రత్యేక క్యాంపులు

మంగళగిరి: ఓటర్ల జాబితాపై ఈ నెల 9, 10 శని, ఆదివారాలలో ప్రత్యేక క్యాంపులు నిర్వహించనున్నట్లు ఎలక్షన్ డీటీ రమణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద 9, 10 తేదీలతో పాటు 23, 24వ తేదీలలో (ప్రతి నెలా రెండవ, నాలుగవ శని, ఆదివారాలు)లో పోలింగ్ కేంద్రాలలో ప్రత్యేక క్యాంపులు నిర్వహించనున్నట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు బీఎల్‌వోలు, ఓటర్ల జాబితాలు అందుబాటులో ఉంటారని ఓటర్లు తమ ఓటు జాబితాలో పరిశీలించుకుని సవరణలు ఉంటే సరిచేసుకోవచ్చన్నారు. 18 సంవత్సరాలు నిండిన వారంతా తమ ఓటు నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ప్రజలందరూ ఈ ప్రత్యేక క్యాంపులు తప్పక వినియోగించుకోవాలని కోరారు.

మున్సిపల్ స్కూల్ విద్యార్థికి రాజ్య పురస్కార్



పొన్నూరు: పట్టణంలోని శ్రీ రామ మున్సిపల్ హైస్కూల్ 8వ తరగతి విద్యార్థి తోట దుర్గారావుకు రాజ్య పురస్కార్ అవార్డు లభించింది. గురువారం విజయవాడలోని రాజ్ భవన్‌లో నిర్వహించిన భారత్ స్కౌట్ అండ్ గైడ్స్ 75వ ఆవిర్భావ దినోత్సవంలో దుర్గారావుకు రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ ఈ అవార్డును ప్రదానం చేసి, అభినందించారు. స్కౌట్ ఉపాధ్యాయులు, శ్రీ రామ మున్సిపల్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు కాకుమాను లాజర్ బాబు, ఉపాధ్యాయులు, బీసీ హాస్టల్ వార్డెన్ నాయుడు వీరాస్వామి, నుసుమ శ్రీనివాస్‌లు ఈ సందర్భంగా విద్యార్థిని అభినందించారు.

కిట్స్ అధ్యాపకుడికి డాక్టరేట్



ప్రత్తిపాడు: వట్టిచెరుకూరు మండలం వింజనంపాడులోని కె.కె.ఆర్. అండ్ కె.ఎస్.ఆర్. ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (కిట్స్) కళాశాలలో సైన్స్ అండ్ హ్యుమానిటీస్ విభాగంలో అధ్యాపకునిగా చేస్తున్న ఎం. నరేంద్రనాథ్ రెడ్డికి డాక్టరేట్ లభించింది. గణితంలో 'ఏ స్టడీ ఆన్ ఎంహెచ్‌డీ ఫ్లో ఆఫ్ మైక్రో పోలార్ ఫ్లూయిడ్స్ విత్ రేడియేషన్ అండ్ కెమికల్ రియాక్షన్' అనే అంశంపై చేసిన పరిశోధనకు కుప్పం ద్రవిడ యూనివర్సిటీ ఈ డాక్టరేట్ ప్రదానం చేసింది. ఈ సందర్భంగా గురువారం స్థానిక కళాశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు ఆయన్ను అభినందించారు. కళాశాలలో అధ్యాపకులను పరిశోధనల దిశగా ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి కోయి శేఖర్, ప్రిన్సిపల్ డా. పి.బాబు, అకడమిక్ డైరెక్టర్ డా. కె. హరిబాబు, విభాగాధిపతి ఎం. బసవేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

18 షాపులకు రెండేళ్ల అనుమతులు

తెనాలిరూరల్: తెనాలి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయ పరిధిలోని 25 మద్యం దుకాణాలకు గాను 18 దుకాణాలకు రెండేళ్ల కాలపరిమితితో పర్మనెంట్ లైసెన్సులు జారీ చేసినట్టు ఎక్సైజ్ సీఐ ఏవీ చలం తెలిపారు. తెనాలి పట్టణంలో రెండు, మండలంలో రెండు, కొల్లిపర, దుగ్గిరాల మండలాల్లో మూడు దుకాణాలకు ఇంకా లైసెన్సులు ఇవ్వాల్సి ఉందన్నారు. గురువారం నాటికి 72 శాతంగా 18 దుకాణాలకు పర్మనెంట్ లైసెన్సు జారీ ప్రక్రియ పూర్తవుతుందన్నారు. తెనాలి మండలం కఠెవరం గ్రామం సహా కొల్లిపర మండలంలో రెండు బెల్టు కేసులు నమోదు చేసినట్టు చెప్పారు. ఎక్కడైనా బెల్టు షాపులు నిర్వహించినా, ప్రైవేటు వ్యక్తులు మద్యం విక్రయాలు జరిపినా కఠిన చర్యలు తీసుకుంటామని ఇన్‌స్పెక్టర్ చలం హెచ్చరించారు.

ఆహారంలోనే ఆరోగ్యం

- ఆహారంలో జాగ్రత్తలు పాటించకుంటే ప్రమాదం
- వ్యాధినిరోధక శక్తిని పెంచుకుంటే ఆరోగ్యానికి మంచిది
- సలహాలు, సూచనలు పాటించాలంటున్న వైద్యులు

పౌష్టికాహారంతోఆరోగ్యం పదిలం



పప్పు దినుసులు



కూరగాయలు



ఆకుకూరలు

మంగళగిరి: ప్రస్తుత ఆధునిక జీవన శైలిలో ఒత్తిడి, మానసిక ప్రశాంతత, పౌష్టికాహారం వంటివి కొరవడడంతో ప్రతి ఇంటిలోను అనారోగ్యాల పాలైన వారు ఉంటున్నారు. అటు తాగునీరు అపరిశుభ్రత కారణంగా డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వంటి సీజనల్ వ్యాధులూ ప్రబలుతున్నాయి. దీంతో వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరు రోగనిరోధక శక్తిని పెంపొందించుకునేందుకు పౌష్టికాహారం తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను పాటించడం, సరైన ఆహారపు అలవాట్లు అలవరచుకోవడం, వ్యాయామం చేయడం ఎంతో అవసరం. పౌష్టికాహారం తీసుకోకపోవడం, సరైన వ్యాయామం లేకపోవడం వలన ఎంతో మంది వ్యాధి నిరోధక శక్తి తగ్గి వ్యాధుల బారిన పడుతున్నారు. రోజువారీగా శరీరారానికి కావాల్సిన ఆరోగ్యకరమైన పౌష్టికాఆహారం తీసుకోవడం వలన ఆరోగ్యంగా ఉండవచ్చని వైద్యులు, నిపుణులు సూచిస్తున్నారు.

- నిల్వ ఉన్న ఆహారం, ఉప్పుతో కూడిన ఆహారం, బయట దొరికే చిరు తిండ్లు, జంక్ ఫుడ్, ఫ్రిజ్‌లలో నిల్వ ఉంచే పదార్థాలు, ఎక్కువ నూనె కలిగిన ఆహారం తినడం ఆరోగ్యానికి మంచిది కాదని వైద్యులు చెబుతున్నారు.
- నీరు, పాలు, పప్పుధాన్యాలు, పీచు పదార్థాలు ఎక్కువగా ఉండే ఆహారం తీసుకోవాలి. పరిశుభ్రపరమైన కాచి చల్లార్చిన నీటిని ఎక్కువగా తాగడం వలన 50 శాతం రుగ్మతలు తుగ్గుతాయి.
- ప్రతి రోజు పావు లీటరు పాలు తాగటం ఆరోగ్యానికి ఎంతో మంచిది. టీ, కాఫీ అలవాటు ఉన్న వారు ఒకటి లేదా రెండు సార్లు మాత్రమే తాగడం శ్రేయస్కరం.
- ఆహారంలో వేరుశనగ, శనగల వంటి పప్పుధాన్యాలను క్రమం తప్పకుండా తీసుకునేలా చూసుకోవాలి. ప్రతి రోజు ఏదో ఒక ఆకుకూర తినడం అలవాటు చేసుకోవాలి.
- నిమ్మ, జామ, ఉసిరి వంటి సీ విటమిన్ కలిగిన కాయలను తీసుకోవడం, రోజూ ఉడికించిన గుడ్డు తినడంతో పాటు వారానికి ఒక సారి చికెన్, మటన్, చేపలు వంటివి ఆహారంలో భాగం చేసుకోవాలి.
- ఆహారాన్ని అతిగా తీసుకోకుండా మితంగా ప్రతి మూడు గంటలకు ఒకసారి తీసుకోవడం ఎంతో మంచిది.
- ప్రతి రోజు భోజనానాకి ముందు తర్వాత చేతులు శుభ్రంగా కడుక్కోవాలి, శుభ్రమైన, తాజా ఆహారం తీసుకోవడం, శుభ్రమైన నీటిని తాగడం ఆరోగ్యానికి మంచిది.
- నారింజ, పసుపు రంగులో ఉండే కొన్ని పండ్లు తినడం ద్వారా కొన్ని రకాల వ్యాధులకు దూరంగా ఉండవచ్చు.
- ఆయ సీజన్‌లలో దొరికే తాజా కూరగాయలు, పండ్లు రోజు వారీ ఆహారంలో భాగం చేసుకోవాలి. దీంతో శరీరానికి అవసరమైన పోషకాలు, ఫైబర్ అందుతాయి.

మంచి ఆహారంతో ఆరోగ్యంగా ఉండవచ్చు



ప్రతి రోజు ఆరోగ్యకరమైన పౌష్టికాహారం తినడం ఎంతో మంచిది. నాణ్యమైన కూరగాయలు పండ్లు తీసుకోవాలి. అన్ని రకాల కూరగాయలు, పండ్లు తినడం వలన శరీరానికి కావాల్సిన పోషకాలు అందుతాయి. బాగా ఉడికించిన ఆహారాన్ని తీసుకోవాలి. ఆహారంలో పప్పుధాన్యాలను, ఆకుకూరలను తీసుకోవడం ఆరోగ్యానికి ఎంతో మంచిది. జామ, మామిడి, బొప్పాయి, గుమ్మడి వంటి పండ్లు తినడం వలన శరీరానికి కావాల్సిన విటమిన్లు దొరుకుతాయి. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం వలన ఆరోగ్యంగా జీవించవచ్చు.

–డాక్టర్ గీతా పద్మజ, వైద్యురాలు, ప్రభుత్వాసుపత్రి

న్యాయస్థానాల తీర్పును అమలు చేయాలి



తాడేపల్లిరూరల్ : తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మనందపురం ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ యాజమాన్యంపై న్యాయస్థానాల తీర్పులను గౌరవించి వారికి న్యాయం చేయాలని ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ యూనియన్ నాయకులు కూరపాటి స్టీఫెన్ డిమాండ్ చేశారు. గురువారం సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు నిర్వహిస్తున్న దీక్షా శిబిరం వద్దకు ఆయన విచ్చేసి మాట్లాడుతూ కార్మికులు వారి కష్టానికి తగ్గ ప్రతిఫలం అడుగుతున్నారని అన్నారు. రూ.200 కోట్ల విలువ చేసే ఫ్యాక్టరీ భూమిని తాము కాపాడామని, నష్ట పరిహారం కింద తమకు భూమి ఇస్తారా, నగదు రూపంలో ఇస్తారా చెప్పాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారని అన్నారు. 33 ఏళ్ల క్రితం లాకౌట్ చేసిన కంపెనీ యాజమాన్యం ఆ నెల పని చేసిన కార్మికులకు కూడా జీతాలు ఇవ్వకుండా ఇబ్బంది పెట్టిందని విమర్శించారు. న్యాయస్థానాల తీర్పును పరిగణనలోకి తీసుకుని తమకు న్యాయం చేయాలని కార్మికులు ఆందోళన చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్మికులు అంకయ్య, ఆశీర్వాదం, సూరి, నవనీతం, రమాదేవి, ఇమాంబి, శారద, సుబ్బారావు, సాంబయ్య పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

తెనాలిరూరల్: ఆత్మహత్యాయత్నం చేసిన వివాహిత చికిత్స పొందుతూ మృతి చెందింది. కుటుంబ కలహాల నేపథ్యంలో పట్టణ బాలాజీరావుపేటకు చెందిన వివాహిత అఫ్సానా గత నెల 31వ తేదీన మార్కెట్‌లో ఒంటిపై పెట్రోలు పోసుకుని నిప్పంటించుకుని ఆత్మహత్యాయత్నం చేసిన సంగతి తెలిసిందే. తీవ్ర గాయాలపాలైన ఆమె చికిత్స పొందుతూ బుధవారం సాయంత్రం మృతి చెందింది. వైద్యశాల నుంచి వచ్చిన సమాచారం మేరకు వన్‌టౌన్ పోలీసులు గురువారం శవపంచనామా నిర్వహించి, పోస్టుమార్టమ్ అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు.

గర్భిణులు తగిన జాగ్రత్తలు పాటించాలి

జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి విజయలక్ష్మి



ప్రతిజ్ఞ చేయిస్తున్న జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి విజయలక్ష్మి, ఆర్మన్ సంస్థ ప్రతినిధులు

ఫిరంగిపురం: గర్భిణులు తగిన జాగ్రత్తలు పాటించడం ద్వారానే ఆరోగ్యంగా ఉంటారని జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి విజయలక్ష్మి అన్నారు. మండలంలోని నుదురుపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మేడికొండూరు, ఫిరంగిపురం, నుదురుపాడు, పెదకాకాని, మందడం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు చెందిన ఆరోగ్య సిబ్బందికి గురువారం గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన, కిల్‌కారి (చిన్నారి చిరునవ్వు) కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్మన్ సంస్థకు చెందిన న్యూజిల్యాండ్ ప్రతినిధులు, జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి కె.విజయలక్ష్మి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులకు రక్తహీనత లేకుండా చూడాలని, హైరిస్క్ ఉన్న గర్భిణుల గత చరిత్ర, ప్రస్తుత చరిత్రలు పూర్తిగా తెలుసుకోవాలన్నారు. బీపీ, షుగర్, యూరిన్ పరీక్షలు చేసి పూర్తి సమాచారం యాప్‌లో అప్‌లోడ్ చేయాలని తెలిపారు. ఎప్పటికప్పుడు ఆరోగ్య సిబ్బంది హైరిస్క్ గర్భిణుల పూర్తి సమాచారాన్ని తెలుసుకుంటూ ఉండాలని చెప్పారు. ప్రసవం సక్రమంగా జరిగేలా సమీపంలోని వైద్యశాలలో వారిని చేర్పించేలా చూడాలన్నారు. అనంతరం గర్భిణుల ప్రసవం విషయంలో తగిన జాగ్రత్తలు పాటిస్తామంటూ సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. కిల్‌కారి సేవలపై డీపీహెచ్‌ఎన్ డాక్టర్ ప్రియాంక, డాక్టర్ చరణ్‌లు ఆరోగ్య సిబ్బందికి తగిన సూచనలు, సలహాలు అందజేశారు. కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

స్క్రీనింగ్‌తో క్యాన్సర్ గుర్తింపు



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది



నుదురుపాడులో ర్యాలీలో ఆరోగ్య సిబ్బంది

మంగళగిరి: రాష్ట్రంలో ఏడాదిలో 70 వేల కొత్త క్యాన్సర్ కేసులు వస్తున్నాయని, వాటిలో 40 వేల మంది వరకు మృతి చెందుతున్నారని గణపతినగర్ యూపీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి.అనూష అన్నారు. గురువారం జాతీయ క్యాన్సర్ అవగాహనా దినోత్సవం సందర్భంగా అవగాహనా ర్యాలీ నిర్వహించారు. క్యాన్సర్‌పై విజయం, స్క్రీనింగ్‌తో పాటు ముందస్తు పరీక్షలు, క్యాన్సర్ నుంచి రక్షణ అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. మద్యం, ధూమపానానికి దూరంగా ఉంటే క్యాన్సర్‌కు దూరం కావచ్చన్నారు. ప్రతి రోజు వ్యాయామం చేస్తూ మంచి ఆహారం తీసుకుంటూ బరువు నియంత్రణలో ఉంచుకోవాలన్నారు. 14వ తేది నుంచి ఏఎన్ఎం, ఆశాలు ఇంటింటికీ తిరిగి నోటి, రొమ్ము, గర్భాశయ క్యాన్సర్‌లపై స్క్రీనింగ్ చేస్తారని వారికి ప్రజలు సహకరించాలన్నారు. క్యాన్సర్ అనుమానిత కేసులను గుంటూరు జీజీహెచ్ క్యాన్సర్ విభాగానికి పంపి పరీక్షలు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎయిమ్స్ వైద్యులు విష్ణు, ఏఎన్ఎంలు, ఆశాలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఫిరంగిపురం: మండలంలోని నుదురుపాడు గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం జాతీయ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా ఆరోగ్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యురాలు ఫరీనాబేగం మాట్లాడుతూ ముందస్తు పరీక్షలతోనే క్యాన్సర్ నుంచి రక్షణ సాధ్యమవుతుందని చెప్పారు. క్యాన్సర్ సోకిన తరువాత అశ్రద్ధ చేయకుండా స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకొని తగిన జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. అనంతరం ఆరోగ్య సిబ్బందితో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ యానీగ్రేస్, సీహెచ్‌వో వెంకటలక్ష్మి, సూపర్‌వైజర్లు కొండపల్లి సుదర్శన్‌రాజు, అబ్దుల్ రెహ్మాన్, హెచ్‌వీ ఖాజాబీ, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రతిభ చాటిన చిన్నారి శ్రీవల్లి



గుంటూరు రూరల్: తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్‌లో ఇటీవల టాలెంట్ సెర్చ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చొడవరం గ్రామంలోని చేతన శ్రీ వేంకటేశ్వర బాలకుటీర్‌కు చెందిన ఉషోదయ ఇంగ్లిష్ మీడియం విద్యార్థిని శ్రీవల్లి ఉత్తమ ప్రతిభ కనబరిచిందని బాలకుటీర్ వ్యవస్థాపకురాలు డాక్టర్ మంగాదేవి తెలిపారు. గురువారం పాఠశాలలో బాలికకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంగాదేవి మాట్లాడుతూ... హైదరాబాద్‌లో నిర్వహించిన పోటీలలో ప్రపంచ పటంలోని 42 ప్రదేశాలు గుర్తించటంతోపాటు 25 వైద్య పరిభాషా పదాలను ఒక్క నిమిషంలో గుర్తించి చెప్పగలిగిందన్నారు. శ్రీవల్లిని ఆ దిశగా ప్రోత్సహించిన తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను అభినందించారు. కార్యక్రమంలో బాలకుటీర్ సీఈవో రఘురాం, సహ కార్యదర్శి జయశ్రీ, చేతన నిర్వాహకురాలు మరుద్వతి, ప్రిన్సిపల్ నర్జీస్, లక్ష్మీప్రసన్న, వెంకటేశ్వరరావు తదితరులు విద్యార్థినిని అభినందించారు.

10న ఉచిత రక్తనాళాల పరీక్ష శిబిరం

తెనాలిఅర్బన్: రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం, ఏషియన్ వాస్కులర్ హాస్పటల్స్ హైద్రాబాద్ వారి సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 10న ఉచిత రక్తనాళాల వైద్య పరీక్షల శిబిరాన్ని నిర్వహించనున్నట్లు క్లబ్ అధ్యక్షుడు ఈదర శ్రీనివాసరావు తెలిపారు. టుటౌన్ పోలీస్ స్టేషన్ రోడ్డులోని రోటరీ క్లబ్ కార్యాలయంలో గురువారం ఉచిత వైద్య శిబిరానికి సంబంధించిన కరపత్రాలు ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్త నాళాల వైకల్యం, రక్తంలో గడ్డలున్నాయా లేదా అనే సుమారు రూ.5వేల విలువ చేసే పరీక్షలు ఇక్కడ ఉచితంగా చేయనున్నట్లు చెప్పారు. బస్టాండ్ అవుట్ గేట్ ఎదురు ఉన్న ఈగల్ రెస్టారెంట్ వద్ద ఉదయం 10 గంటలకు శిబిరం ప్రారంభమౌతుందని చెప్పారు. అందరు దీనిని ఉపయోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు కన్నెగంటి మురళీకృష్ణ, ఈదర వెంకట పూర్ణచంద్, నల్లూరి వెంకటేశ్వరరావు, ప్రవీణ్, ఉపేంద్ర, ఏషియన్ వాస్కులర్ హాస్పటల్ మార్కెటింగ్ హెడ్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ పోస్టులను భర్తీ చేయండి

సీపీఎం నాయకులు



కాలనీ వాసులతో మాట్లాడుతున్న సీపీఎం పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర్లు

తాడేపల్లిరూరల్ : దేశంలో, రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉద్యోగ పోస్టులను భర్తీ చేయాలని సీపీఎం పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర్లు ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సీపీఎం నిర్వహిస్తున్న ప్రజాపోరు కార్యక్రమం గురువారం ఉండవల్లి హెడ్ స్లూయిజ్ వద్ద గల పుష్కర కాలనీలో నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేయకుండా సంపద ఎలా సృష్టిస్తారని, ప్రతి ఏటా దేశంలో నిరుద్యోగం పెరుగుతోందని అన్నారు. ఎంబీఏ, ఎంసీఏ చేసిన వారు ఉద్యోగ అవకాశాలు లేక ప్రైవేటు ఉద్యోగాలు చేస్తున్నారని, నిరుద్యోగులకు భృతి ఇస్తామన్న సంగతిని ప్రభుత్వం గుర్తుంచుకోవాలని అన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా నిత్యావసర సరుకుల ధరలు మధ్యతరగతి, సామాన్య ప్రజలు కొనుగోలు చేయలేని విధంగా ఆకాశాన్ని అంటుతున్నాయని అన్నారు. విద్యుత్ చార్జీల పేరుతో వేల కోట్ల రూపాయలను ప్రజలపై భారం మోపుతున్నారని విమర్శించారు. ఈ నెల 14వ తేదీ తాడేపల్లి తహసీల్దార్ కార్యాలయం వద్ద నిర్వహించే ప్రజాపోరు కార్యక్రమానికి స్థానికులు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం కేఎల్‌రావు కాలనీ శాఖ కార్యదర్శి కట్ట మేరి, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యం మెరుగుదలకు చర్యలు



చర్చి పక్కన బజారులో చెత్తను ఎత్తి వేసి బ్లీచింగ్ చల్లుతున్న సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని బజారుల్లో పారిశుద్ధ్యం మెరుగుదలకు చర్యలు చేపట్టినట్లు పంచాయతీ ఏవో ఎ.కిషోర్ బాబు చెప్పారు. సాక్షి దినపత్రికలో గురువారం ప్రచురించిన 'ప్రధాన వీధికే పారిశుద్ధ్యం' వార్తకు ఆయన స్పందించారు. ఉదయాన్నే ట్రాక్టర్లను పంపి పారిశుద్ధ్య కార్మికులచే చెత్తను సేకరించేలా చేశారు. అదే విధంగా చర్చి పక్కన బజారులో చెత్తను ఎత్తివేయించి శుభ్రం చేయించారు. కాలువలు పూడిక తీసి బ్లీచింగ్ చల్లించారు. ఆయన మాట్లాడుతూ తాను ఇటీవలే బాధ్యతలు స్వీకరించానని, చెత్తను సేకరించేందుకు వినియోగించే ట్రాక్టరు వెళ్లలేని బజారులకు రిక్షాలు బాగు చేయించి పంపిస్తానని చెప్పారు. అదే విధంగా పారిశుద్ధ్య కార్మికుల బకాయిలు త్వరలో చెల్లించేందుకు కృషి చేస్తానన్నారు.


పెంచిన విద్యుత్ చార్జీలను ఉపసంహరించుకోవాలి



ధర్నా నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు

మంగళగిరి: ప్రజలపై విద్యుత్ భారం మోపడాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. పెంచిన విద్యుత్ చార్జీలను నిరసిస్తూ గురువారం పట్టణంలోని గండాలయపేటలోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జంగాల మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచబోమని ఇచ్చిన హామీని తుంగలో తొక్కి ఐదు నెలలకే విద్యుత్ చార్జీలను పెంచడం దుర్మార్గమన్నారు. ట్రూ అప్ చార్జీల పేరుతో రూ.17 వేల కోట్ల భారాన్ని మోపేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేయడం దారుణమన్నారు. విద్యుత్ సర్దు బాటు చార్జీలను ప్రభుత్వమే భరించి ప్రజలపై భారం పడకుండా చూడాలని కోరారు. విద్యుత్ చార్జీలను పెంచడం ఉపసంహరించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు చిన్ని తిరుపతయ్య, జాలాది జాన్‌బాబు, నందం బ్రహ్మేశ్వరరావు, చిన్ని సత్యనారాయణ, ఉడతా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్య సాధనకు కష్టపడాలి



మాట్లాడుతున్న కేవీ ప్రదీప్

చేబ్రోలు: విద్యార్థులు లక్ష్యం నిర్దేశించుకుని సాధించడానికి కృషి చేయాలని ప్రముఖ మోటివేషనల్ స్పీకర్, నటుడు కేవీ ప్రదీప్ అన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో బీటెక్ నాలుగో సంవత్సరం విద్యార్థులకు ''టేక్ ఆఫ్ టు టేక్ ఓవర్'' పేరిట మోటివేషనల్ సెషన్ గురువారం నిర్వహించారు. ఇందులో కేవీ ప్రదీప్ మాట్లాడుతూ.. జీవితంలో ఉన్నతంగా ఎదగాలంటే విలువలు, బలం, వైఖరి, నైపుణ్యాలు, జ్ఞానం అలవర్చుకోవాలన్నారు. క్యాంపస్ డ్రైవ్‌లోనే ఉద్యోగం సాధిస్తే చాలా వరకు ఒత్తిడి తగ్గుతుందని చెప్పారు. మీలు భావాలను ఇతరులకు సమర్థంగా చెప్పారంటే కమ్యూనికేషన్ స్కిల్స్‌లో ముందంజలో ఉన్నట్లు భావించాలన్నారు. వీలైనంత వరకు సోషల్ మీడియాను పరిమిత సమయం వెచ్చించాలని సూచించారు. ప్రస్తుతం కంపెనీలన్నీ ఇండస్ట్రియల్ రివల్యూషన్ 4.0ను అనుసరిస్తున్నందున విద్యార్థులందరూ కొత్త టెక్నాలజీని వేగంగా నేర్చుకుంటేనే జీవితంలో ముందుకు సాగగలరన్నారు. విద్యార్థుల ఎదుగుదలను చూసి తల్లిదండ్రులు సంతోషపడేలా ఉండాలన్నారు. కార్యక్రమంలో డీన్లు, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు, పాల్గొన్నారు.

అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా చూడాలి



తెనాలిరూరల్: డిసెంబర్ 14వ తేదీన నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా చూడాలని 11వ అదనపు జిల్లా న్యాయమూర్తి డి. శ్రీనివాసులు న్యాయవాదులను కోరారు. తెనాలి కోర్టు సముదాయంలో గురువారం సాయంత్రం న్యాయవాదులతో ఆయన సమావేశమయ్యారు. లోక్‌అదాలత్‌లో కేసులు రాజీపడితే కోర్టు ఫీజులు సైతం వాపసు వస్తాయని, కక్షిదారులకు దీనిపై అవగాహన కల్పించాలని సూచించారు. రాజీ అయ్యే వీలున్న కేసులన్నిటిని అదాలత్‌లో పరిష్కరించుకునేలా కక్షిదారులకు అవగాహన కల్పించాలన్నారు. అదాలత్‌లో కేసులు పరిష్కరించుకోవడం ద్వారా సమయంతో పాటు డబ్బులు ఆదా అవుతాయని స్పష్టం చేశారు. అదాలత్‌లో వీలైనన్ని ఎక్కువ కేసులు రాజీ అయ్యేలా చొరవ చూపాలని కోరారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బేతాళ ప్రభాకర్, కార్యదర్శి హరిదాసు గౌరీశంకర్, సీనియర్, జూనియర నాయవాదులు పాల్గొన్నారు.

పేదలకు నిత్యావసరాల పంపిణీ

తెనాలిఅర్బన్: దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో పట్టణంలోని యడ్లలింగయ్య కాలనీ, కఠెవరం కాల్వ కట్ట, టీచర్స్ కాలనీ, బాలాజీరావుపేటలో నివశించే పేదలకు 13 రకాల నిత్యవసర వస్తువులను గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కో ఆర్డినేటర్ రవితేజ మాట్లాడుతూ పేదలకు సేవ చేసేందుకు సంస్థలను స్థాపించినట్లు తెలిపారు. కార్యక్రమంలో తెనాలి, గుంటూరు సిటీల కో ఆర్డినేటర్‌లు రాజశేఖర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.